RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 281 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం ఆదివారం, 14 ఏప్రిల్ 2024 పేజీలు : 4 వెల : 2/-

## లోక్ సభ ఎన్నికల తర్వాత 'మహిళలకు రూ.2500'

### మరో హామీ అమలు దిశగా రేవంత్ సర్కార్ అడుగులు






హైదరాబాద్ : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆరు గ్యారెంటీలు ఇచ్చింది. ముఖ్యంగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. హామీ ఇచ్చిన ప్రకారమే అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఈ ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలు పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. అలాగే ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. దీని ద్వారా లక్షల్లో లబ్ధి పొందుతున్నారు. మీరు లిసిండర్ బుక్ చేసి రూ.900 చెల్లిస్తే సిలండర్ వస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో రూ.400 జమ చేస్తోంది. దీంతో లబ్ధిదారులకు రూ.500 గ్యాస్ సిలిండర్ లభించినట్లు అవుతుంది. అలాగే ఉచిత విద్యుత్ పథకాన్ని కూడా అమలు చేస్తున్నారు. 200 యూనిట్ల లోపు ఉన్నవారికి విద్యుత్ బిల్లు మాఫీ చేస్తున్నారు. ఈ బిల్లును ప్రభుత్వమే చెల్లించనుంది. మహాలక్ష్మి పథకంలో భాగంగా మరో హామీ కూడా అమలు చేయాల్సి ఉంది. అదే కుటుంబ మహిళ పెద్దకు రూ.2500 చెల్లించాలి. ఎన్నికలకు ముందు మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలు అమలు చేస్తోంది. మహిళలకు రూ.2500 పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

అయితే రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉంది. ఈ నేపథ్యంలో లోక్ సభ ఎన్నికల తర్వాతే మహిళలకు నెలకు రూ.2500 అందించే పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వ పథకాలు పొందాలంటే.. రేషన్ కార్డు అవసరం. రేషన్ కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హులు. అయితే రాష్ట్రంలో చాలా మంది కొత్ రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నారు.

## తమిళనాట పొడిచిన కొత్త పొత్తు..

### మజ్లిస్ - అన్నాడీఎంకే కలిసి ఎన్నికల బరిలో...

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. దేశంలో కొత్త పొత్తులు పొడుస్తున్నాయి. అధికార బీజేపీని ఢీ కొట్టడమే ధ్యేయంగా తమిళనాడులో రెండు పార్టీలు పొత్తు పెట్టుకోవడానికి రెడీ అయ్యాయి. తమిళనాడు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, జాతీయ పార్టీ ఏఐఎంఐఎంలు పొత్తుకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఓ ప్రకటన జారీ చేశారు. బీజేపీని వ్యతిరేకిస్తూ బయటకి వచ్చి



న.. అన్నాడీఎంకే భవిష్యత్తులోనూ బీజేపీతో పొత్తు పెట్టుకునేది లేదని స్పష్టం చేసిన తరుణంలో మజ్లిస్‌తో పొత్తు ప్రతిపాదన ముందుకు వచ్చింది. సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్‌ఆర్‌సీ చట్టాలను వ్యతిరేకిస్తామని అన్నాడీఎంకే.. మజ్లిస్‌కు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అందువల్ల రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇరు పార్టీలు పొత్తుకు సిద్ధమయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల వరకు తమ పొత్తు కొనసాగుతుందని అసద్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఓటర్లలో దాదాపు 5 శాతం ముస్లిం సామాజికవర్గ ఓట్లు ఉన్నాయి.

## ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకుందాం

### టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

### సమస్యల సాధనకై కదం తొక్కిన డిగ్రీ గెస్ట్ లెక్చరర్లు : ఆత్మీయ సమ్మేళనం విజయవంతం

**హైదారాబాద్ ఏప్రిల్ 13(ప్రభాత సమాచారం)** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహించే గెస్ట్ లెక్చరర్ల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండి సాధించుకున్నామని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం హైదారాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్ట్ లెక్చరర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోదండరాం తో పాటుగా ప్రగతి భవన్ వార్ రూమ్ ఇంచార్జ్ వార్ రూం ఛైర్మెన్ పవన్ మల్లాడి, టిజేఎస్ జనరల్ సెక్రెటరీ నిజ్జన రమేష్ లు పాల్గొన్నారు. ఈ సమ్మేళనం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొర్ర ఈశ్వర్ లాల్ ఆధ్వర్యం లో కొనసాగింది. ఈ సందర్భగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్ట్ లెక్చరర్లకు ఆటో రెన్యువల్, సమాన పనికి సమాన వేతనం, ప్రమాద భీమా వంటి సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటిని అమలు అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్ట్ లెక్చరర్ల అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.కొర్ర ఈశ్వర్ లాల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న గెస్ట్ లెక్చలర్ల కష్టాలు ,సమస్యలు వర్ణానాథితమన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న డిగ్రీ గెస్ట్ లెక్చలర్లను ఆటో రెన్యువల్ తో కంటిన్యూ చేసి , కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రతి నెలకు 50 వేల కన్సాలిడేటెడ్ పే అందించి, పీరియడ్ విధానాన్ని రద్దుచేసి 12 నెలలకు జీతంను తక్షణం అమలు చేయాలన్నారు. ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్స్ ద్వారా డిస్టర్బ్ అయ్యే గెస్ట్ లెక్చరర్ లను రీ లోకేట్ చేసి, ఇ హెచ్ యస్ కార్డులు జారీ చేసి,ప్రమాదాలు , ఏదైనా రిస్కు జరిగిన ప్రమాద భీమా తో పాటు 20 లక్షల పరిహారం అందించి, డిగ్రీ గెస్ట్ లెక్చలర్లను కాంట్రాక్టు



ఎంప్లాయిస్ /మినిమం టైం స్కేల్ ఉద్యోగులుగా కన్వర్ట్ చేయాలని కోరారు. గెస్ట్ లెక్చరర్స్ తమ కవితలు, పాటల ద్వారా గెస్ట్ లెక్చరర్స్ ఎదుర్కుంటున్న సమస్యలపై పాటలు, కవితల రూపంలో వర్ణించారు. అంతకుముందు గెస్ట్ లెక్చరర్ల రాష్ట్ర నూతన క్యాలెండర్ ఆవిష్కరించి, అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్ట్ లెక్చరర్ల అసోషియేషన్ సెక్రటరీ గణేష్, జనరల్ సెక్రటరీ బగ్గు నాయక్, మౌనిక, శంకర్, గంగాధర్,ప్రవీణ్, జావిద్ అలి, నరేష్, అశోక్, శివ కుమార్, సురేష్ రెడ్డిపాల్గొన్నారు.



## నాటి ఇబ్బందులే నేడు కనబడుతున్నాయ్...!





### వాగ్దానాల అమలుపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

### చేవెళ్ళ బిఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్

రంగారెడ్డి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పుణ్యమా అని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారా, వారి స్ఫూర్తితో తెలంగాణ సాధించుకున్నామని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. 15 ఏండ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత అనేక త్యాగాలు, లాఠీ దెబ్బలు, కేసులు, జైళ్లు.. వగైరా వగైరా తర్వాత మన తెలంగాణ సాధించుకున్నాం అని కేసీఆర్ గుర్తు చేశారు. చేవెళ్లలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. రేపు అంబేద్కర్ జయంతి సందర్భంగా తెలం గాణ రాష్ట్ర సమాజం పక్షాన, మన పక్షాన అంబేద్కర్‌కు హృదయ పూర్వకమైన నివాళులర్పిస్తున్నాను. ఈ దేశంలోనే ఎక్కడ లేనంత సమున్నత గౌరవం అంబేద్కర్‌కు ఇవ్వాలని రెండు పనులు చేశాం. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పి దేశానికే సమున్నత గౌరవం వచ్చేలా చేశాం. కొత్తగా నిర్మించిన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టుకున్నాం. 75 ఏండ్లలో ఇలాంటి పని ఎవరూ చేయలేదు. ఇలా ఆ హానీయుడికి నివాళులర్పించామని కేసీఆర్ తెలిపారు.

**చిత్తశుద్ధితో కూడిన కార్యాచరణ కనబడుతలేదు..** రాజకీయాలు వస్తుంటాయి, పోతుంటాయి. ఎన్నికలు కూడా వస్తుంటాయి, పోతుంటాయి. కానీ ప్రజానీకానికి ప్రభుత్వం అంటే ఒక ధీమా, ఒక ధైర్యం. మా ప్రభుత్వం ఉంది మమ్మల్ని ఆదుకుంటుందనే విశ్వాసం ఉండాలి. ప్రజలు కోరుకునేది అదే. యావత్ రాష్ట్ర ప్రజానీకానికి ప్రభుత్వం మీద ఆత్మశిశ్వాసం ఉండాలి. ఈ మధ్య ఎన్నికల్లో నేను చాలా సభల్లో చెప్పాను. ఓటు వేసే ముందు జాగ్రత్తగా ఆలోచించాలి అని చెప్పాను. కొన్ని రకాల ఆలోచనలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అంతులేని హామీలు, ప్రలోభాలకు ఓటర్లు గురవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. నాలుగు నెలలు గడిచి ఐదో నెలలో ఉంది కాంగ్రెస్ ప్రభుత్వం. ఏ ఒక్క విషయంలో కూడా ఎన్నికల వాగ్దానాల మీద చిత్తశుద్ధితో కూడిన కార్యాచరణ కనబడుతలేదు. వసతులు, వనరులను కాపాడుకునే నైపుణ్యం కనబడుతలేదు. పదేండ్ల కింద మరిచిపోయిన ఇబ్బందుల మళ్లీ ఇప్పుడు కనబడుతున్నాయని కేసీఆర్ తెలిపారు.

**ఐదు పథకాలు పెట్టాం.. రైతాంగాన్ని కాపాడుకున్నాం..** ఖమ్మం జైల్లో ఉంటే, ఆ తర్వాత ఆరోగ్యం క్షీణిస్తే నిమ్స్‌కు తరలించారు. చా వు నోట్లో తలపెట్టి పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం వచ్చిన కొత్తలో కరెంట్ కోతలు, కాలిపోయే మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, అందని సాగు, తాగునీరు సమస్యలు. నాడు ఇబ్బందుల్లో రైతాంగం ఉండే. దాన్ని నివారించాలని కోడి తన రెక్కల కింద పిల్లలను కాపాడుకున్నట్టు మనం రైతాంగాన్ని కాపాడుకున్నాం. రైతుకు కులం లేదు. ఎవరికి భూమి ఉండే వారు రైతు. అన్ని వర్గాల్లో ఉన్న రైతులను కా పాడుకోవాలని పట్టుబట్టి ఒక ఐదు పథకాలు పెట్టాం. రైతాంగాన్ని కాపాడుకున్నాం.

రైతుబంధు కింద ఎకరానికి రూ.10 వేలు అందిం చాం. 24 గంటల పాటు రెప్పపాటు పోకుండా నాణ్యమైన విద్యుత్ అందించాం. రైతు చనిపోతే గుంట భూమి ఉన్న 5 లక్షల బీమా వారం పది రోజుల్లో వచ్చేలా చేసుకున్నాం. అదే విధంగా రైతుల పంట మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేసి నేరుగా వారి ఖాతాల్లో డబ్బులు పడేలా చేసుకున్నాం. ఇలా రైతుల్లో ఆత్మవిశ్వాసం కల్పించాం అని కేసీఆర్ తెలిపారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## మాల్దీవులకు వెళ్లటానికి భారతీయులు ఇష్టపడం లేదు! ఎందుకని...!?

అవసరం లేకుండానే అక్కసు వెళ్లగక్కటం.. ఇరుగు దేశం మీద నోటికి వచ్చినట్లుగా మాటలు తూలటం లాంటి పనులు చేసిన మల్దీవులకు తగిన శాస్తి తగిలింది. లౌకికవాదుల పేరుతో నోటికి వచ్చినట్లు మాట్లాడే వారిని మినహాయిస్తే.. మాల్దీవుల విషయంలో సామాన్యుల తీరు ఒకలా.. అపర లౌకికవాదుల వాదన మరోలా ఉండటం తెలిసిందే. ఇదిలా ఉంటే.. భారత్ తో దౌత్యవివాదానికి తెర తీసిన ఆ దేశానికి తగిన శాస్తి జరిగినట్లుగా చెప్పాలి. నిత్యం భారత్ నుంచి మాల్దీవులకు వెళ్లే వారు.. ఇప్పుడా దేశానికి వెళ్లటానికి పెద్దగా ఆసక్తి చూపటం లేదు. దీంతో మాల్దీవులను సందర్శించే భారతీయుల ర్యాంకు భారీగా పడిపోవటమే దీనికి నిదర్శనంగా చెప్పొచ్చు. ఈ ఏడాది ఆరంభంలో సాహసాలు చేసే వారు దేశంలోని లక్షద్వీప్ కు రావాలంటూ ప్రధాని మోడీ పిలుపునివ్వటం.. దీనిపై మాల్దీవుల మంత్రులు ముగ్గురు విషం కక్కుతూ.. భారత్ ను చులకన చేసేలా.. తమ మనసులోని విషాన్ని వెళ్లగక్కటం.. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావటం తెలిసిందే. ఈ క్రమంలో బాయ్ కాట్ మాల్దీవ్ అన్న ఉద్యమం పెద్ద ఎత్తున సాగింది. ఇందుకు తగ్గట్లే పలువురు తమ మాల్దీవుల టూర్లను రద్దు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆ దేశాన్ని పర్యటించే భారతీయుల సంఖ్య భారీగా తగ్గింది. ఇందుకు తాజాగా వెల్లడైన గణాంకాలే నిదర్శనం. గత ఏడాది డిసెంబరు 31 వరకు భారత్ నుంచి 2.09 లక్షలకు పైనే పర్యాటకలు మాల్దీవుల్ని సందర్శించారు. ఆ దేశ పర్యాటకంలో 11 శాతం వాటాతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. రష్యా రెండో స్థానంలో.. చైనా మూడోస్థానంలో ఉండేది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది మొదటి మూడు వారాల లెక్కనే తీసుకుంటే.. భారత్ నుంచి 13,989 మంది మాత్రమే సందర్శించారు. ఆ దేశాన్ని సందర్శించిన విదేశీయుల్లో భారతీయులు ఐదో స్థానంలో నిలవగా.. రష్యన్లు మొదటి స్థానంలో నిలిచారు. రెండోస్థానంలో ఇటలీ నిలవగా.. మూడోస్థానంలో చైనా.. నాలుగో స్థానంలో బ్రిటన్ నిలిచింది. మొత్తంగా విదేశీ పర్యాటకుల ద్వారా భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని పొందే ఆ దేశం భారతీయ టూరిస్టులను కోల్పోవటం ద్వారా గట్టి షాకే తగిలిందన్న మాట వినిపిస్తోంది.

## మహనీయులు చూపిన బాటలో నడవాలి : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్







**కడం ఏప్రిల్ 13(ప్రభాత సమాచారం)** రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్, గౌతమ బుద్ధుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలనీ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.శనివారం కడం మండలంలోని కొత్తమద్ది పడగ గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్, గౌతమ బుద్ధుడు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్, బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు.ఆ మహనీ యుడి సిద్ధాంతాలను, ఆలోచనలను నిత్య జీవితంలో పాటించినప్పుడే అదే ఆ మహనీయునికి మన మిచ్చే బహుమానమని అన్నారు.ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం దళితు ల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఆ మహనీయులు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,దళిత, బహుజన సంఘాల నాయకులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటా



**జిల్లా ఎస్పీ గౌష్ ఆలం**

**సిబ్బందిని కోల్పోవడం చాలా బాధాకరం**

**కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లా ఎస్పీ**

**ఆదిలాబాద్ ఏప్రిల్ 13(ప్రభాత సమాచారం)** మంగళవారం జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై నిజామాబాద్ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందిన ఆదిలాబాద్ పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ భానోత్ అక్షయ్ కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం పరామర్శించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బందిని కోల్పోవడం చాలా బాధాకరమని తన విచారాన్ని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కొడుకుని కోల్పోయిన బాధ తల్లికి మాత్రమే తెలుస్తుందని దానిని అర్థం చేసుకోగలరని కంటతడితో స్వర్గీయ భానోత్ అక్షయ్ పార్థివ దేహం పై పుష్పగుచ్ఛంతో నివాళులర్పించారు. ప్రభుత్వపరంగా వచ్చే లబ్ధిని త్వరగా చేకూరేలా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు ను ఆదేశించారు. తక్షణ సహాయం కింద రూ 20వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ నవీన్, డిస్టిక్ పోలీస్ కార్యాలయం సిబ్బంది, నార్నూర్ సర్పంచ్ గజానన్, తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాల పునాది మీద తెలంగాణ సాధించుకున్నాం

**కాంగ్రెస్ ప్రభుత్వం ఫేక్ లీకు లతో నడుస్తుంది**

**10 ఏళ్ల అభివృద్ధి ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి : మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు**



దౌల్తాబాద్: ప్రజలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని, ఎంపీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు.. దౌల్తాబాద్ లో జరిగిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ యువత సమావేశంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి పి వెంకట్రామరెడ్డి లతో కలిసి మాట్లాడారు..10 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ చేసిందేమీ లేదని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయన్నారు..నల్ల ధనం తెచ్చి పేదల ఖాతాల్లో వేస్తామని మోసం చేశారన్నారు.. పేదలకు చేసిందేమీ లేదని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందన్నారు..మాయ మాటల రఘునందన్ గురించి దుబ్బాక ప్రజలకు తెలుసన్నారు. ...6 గ్యారంటీల పేరు న అధికారంలోకి వొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ ఏమైందని, రైతు భరోసా, వడ్లకు రూ.500 బోనస్ ఏమైందన్నారు..నేను వొచ్చేటప్పుడు మిరుదొడ్డి లో మహిళా రైతులతో మాట్లాడానని, వొడ్లు ఎవరూ కొనడం లేదని వాపోయిందన్నారు..మహాలక్ష్మి ద్వారా రూ.2500, నిరుద్యోగ భృతి కూడా మోసం చేశారన్నారు..జాయింట్ కలెక్టర్, కలెక్టర్ గా పనిచేసిన పి వెంకట్రామరెడ్డి మీకు సుపరిచితుడే నని, ఇక్కడి అభివృద్ధి లో.కీలక పాత్ర పోషించడం జరిగిందన్నారు. గతంలో దుబ్బాకలో అనాథలు రాధా రాధికలకు అండగా ఉండి, విద్యాబుద్ధులు చెప్పించి, పెళ్లి కూడా చేసిన మనసున్న వ్యక్తి అన్నారు.. ట్రస్టు ద్వారా సేవ చేయడానికి వొచ్చిన ఆయనకు అండగా నిలవాలన్నారు.

ఉద్యమాల గడ్డ దుబ్బాక

పార్లమెంటు ఎన్నికల్లో దుబ్బాక సత్తా చాటాలి

మాయ మాటల రఘునందన్ కు బుద్ధి చెప్పాలి

100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ఉద్యమాల గడ్డ దుబ్బాకలో మెదక్ ఎంపీ అభ్యర్థి పి వెంకట్రామరెడ్డి కి ఘన విజయం అందిద్దామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.. దుబ్బాక అంటే మొదటి నుండి ఉద్యమ నాయకులు కేసీఆర్, హరీశ్ రావు ల అడుగులో అడుగై ముందుకు సాగడం జరిగిందన్నారు..సిద్దిపేట జిల్లాలోనే కేసీఆర్, హరీశ్ రావు లు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, మెదక్ ఉప ఎన్నికలు మనకు అత్యంత ప్రతిష్టాత్మకమన్నారు..ఇప్పటికే. కాంగ్రెస్ అభ్యర్థి కి ఆదరణ కరువైందని, బీజేపీ అభ్యర్థి కి ఆపార్టీ వాళ్లే ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు..మాయ మాటలు చెప్పే రఘునందన్ ను రెండు సార్లు చిత్తు చిత్తుగా ఓడించడం జరిగిందన్నారు..బూటకపు హామీలు చెప్పి అధికారంలోకి వొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.. యువత కు అండగా ఉంటామన్నారు.ఎడ్లు, నాగలి ఇస్తామని మోసం చెయ్యలేమాట తప్పేటోన్ని కాదు...ప్రభాకరన్నతో కలిసి జోడెడ్లలా పనిచేస్తాంమెదక్ ఎంపీ అభ్యర్థి పి వెంకట్రామరెడ్డిఎడ్లు బండి ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని డోఖా చెయ్యలేదని, గెలిచిన నెల రోజుల్లో 100 కోట్ల తో ట్రస్టు ఏర్పాటు చేసి అండగా ఉంటానని మెదక్ ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ పి వెంకట్రామరెడ్డి హామీ ఇచ్చారు. దుబ్బాక గడ్డ అంటే ఉద్యమాల గడ్డ అని, ఇక్కడ నరనరాన తెలంగాణ రక్తం ఉరుకలెత్తుతుందన్నారు .. ఆశీర్వదిస్తే దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి తో కలిసి దుబ్బాక అభివృద్ధి కి జోడెడ్లలా పనిచేస్తానన్నారు..సిద్దిపేట, గజ్వేల్ తరహాలో దుబ్బాకను అభివృద్ధి లో ధీటుగా మలుస్తామన్నారు. రెండు మార్లు ఎంపీ గా, ఒక సారి ఎమ్మెల్యే గా ప్రభాకర్ రెడ్డి కి ఘన విజయం అందించిన దుబ్బాక ఓటర్లు తనకు సైతం ఆశీస్సులు అందించాలన్నారు..ఏడున్నర ఏళ్ళ జాయింట్ కలెక్టర్, కలెక్టర్ గా మీలో ఒకడిగా పనిచేశానని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, నాటి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ల సహకారం తో దేశం లోనే సిద్దిపేట జిల్లాను టాప్ 10 లో నిలపడం జరిగిందన్నారు..ట్రస్టు ద్వారా దుబ్బాక యువతకు కోచింగ్, వృత్తి నైపుణ్య శిక్షణ అందించి జాబ్ మేళా ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి నిలువ నీడనవుతానన్నారు..ఒక ఉద్యోగిగా కుటుంబానికి ఉద్యోగ అవసరం ఎలా ఉంటుందో తెలుసన్నారు..నియోజకవర్గానికి ఒక ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులకు, నిరుపేదలకు కేవలం ఒక్క రూపాయితో సేవలు అందిస్తామన్నారు....ఇంటింటికి ఒక కేసీఆర్ లా పనిచేసి ఘన విజయం అందించాలని కోరారు..కార్యక్రమంలో టీ ఎస్ రెడ్కో చైర్మన్ వై సతీష్ రెడ్డి సీనియర్ నాయకులు మనోహర రావు, రొట్టె రాజమౌళి పంతులు, నమిలే భాస్కరా చారి, కత్తి కార్తీక, యూత్ నాయకులు సురేష్ గౌడ్, శేఖర్ గౌడ్, మహేష్ రెడ్డి, ఖలీల్, రాజేందర్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు..

## పేదల సంక్షేమానికి పెద్ద పీట

**ఉపాధి హామీలతో ముచ్చటించిన ఎమ్మెల్యే,ఎంపీ అభ్యర్థి**





**కడం ఏప్రిల్ 13(ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం కడెం మండలంలోని పాండ్వాపూర్ గ్రామం వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న వారి వద్దకు ఎంపీ అభ్యర్థి సుగుణతో కలసి వెళ్ళి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రోజువారి కూలీ 400 వరకు పెంచుతామన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

## ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

**టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకట్**



**ఆదిలాబాద్ ఏప్రిల్ 13(ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు టిఎస్ యూటిఎఫ్ కృషి చేస్తూనే ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకట్ అన్నారు. టిఎస్ యూటిఎఫ్ 11 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆఫీసు వద్ద పతాకావిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గత 50 సంవత్సరాలుగా ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి యూటీఎఫ్ కృషి చేస్తూనే ఉందని అన్నారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ మూల సూత్రాలుగా పనిచేస్తున్న యూటీఎఫ్, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే క్రమంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ఓవైపు ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్మిస్తూనే, మరోవైపు ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు కార్యక్రమాలను రూపొందిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమాంలో జిల్లా అధ్యక్షులు ఎం స్వామి, ప్రధాన కార్యదర్శి వి అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు ఎ సురేఖ, కార్యదర్శి కె శ్రీనివాస్ వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో నర్సాపూర్ మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు కాంగ్రెస్ లో చేరిక



**ఉట్నూర్ ఏప్రిల్ 13(ప్రభాత సమాచారం)**
మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కడం మండలంలోని నర్సపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కుడమేత బాజీరావుతో పాటు వార్డు సభ్యులు జాడి జనార్దన్, రమేష్, రాజన్న, శేఖర్, రాములు, రాజకుమార్ లు బిఆర్ఎస్ పార్టీ నుండి ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే,ఎంపీ అభ్యర్థి వారికి కండువా కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించడానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు.

# రోగి తత్వం.. హెూమియో వైద్యం

మిర్యాలగూడ : రోగి తత్వాన్ని పూర్తిగా పరీక్షించి.. దాని ఆధారంగా ఒక్కో రోగికి ఒక్కోలా మందులు ఇచ్చే వైద్యమే హెూమియోపతి. ఈ వైద్యంపై అనేక విమర్శలు ఉన్నప్పటికీ.. మన దేశంలో రెండు వందల ఏళ్లుగా ప్రజల నమ్మకాన్ని చూరగొన్నది. ఆంగ్ల వైద్యంలో నయం కాని అనేక వ్యాధులను హెూమియోపతి వైద్యంలో నయం చేసి చూపించారు వైద్యులు. హెూమియోపతి వైద్యానికి పితామహుడిగా చెప్పుకునే జర్మనీకి చెందిన డాక్టర్ సామ్యేల్ హానిమాన్ జయంతి సందర్భంగా ఏటా ఏప్రిల్ 10న 'ప్రపంచ హెూమియోపతి' దినోత్సవం నిర్వహించుకుంటున్నారు.

దీర్ఘకాలిక రోగాలకు..

ఒకప్పుడు దేశంలో అనేక మందిని బలిగొన్న మెదడు వాపు వ్యాధిని హెూమియో మందుల ద్వారానే తరిమి కొట్టామంటున్నారు వైద్యులు. ఇటీవల కాలంలో అనేక మంది పలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి బాధపడుతున్నారు. వాటిలో అనేక వ్యాధులకు అల్లోపతిలో తప్పనిసరిగా శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. కానీ హెూమియోపతిలో కేవలం మందుల ద్వారానే నయం చేసి చూపిస్తున్నారు వైద్యులు. నొప్పుల కోసం ఆంగ్ల మందులు వాడడంతో ఇతర అవయవాలపై ప్రభావం పడుతుందని.. కానీ ఇతర అవయవానికి ఎటువంటి ఆపద కలుగకుండా వ్యాధిని నయం చేయడమే హెూమియోపతి ప్రత్యేకత అంటున్నారు



నిపుణులు. కీళ్ల నొప్పులు, గొంతులో గడ్డలు, స్వైన్‌ఫ్లూ, కొవిడ్ వంటి వ్యాధులను హెూమియో మందులతో నయం చేయవచ్చంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో మందుల వాడకం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాథమిక వైద్య కేంద్రాల్లో హెూమియో మందులు అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు మిర్యాలగూడ, నల్గొండ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి వంటి ప్రాంతాల్లో ప్రైవేట్ హెూమియో వైద్యశాలలు, మందుల దుకాణాలు సైతం నిర్వహిస్తున్నారు. అనేక మంది రోగులు వివిధ రోగాలను నయం చేసుకునేందుకు హెూమియోనే ఆశ్రయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హెూమియో వైద్య కళాశాల కేవలం హైదరాబాద్‌లో మాత్రమే ఉండడంతో పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం హెూమియో వైద్యానికి తగిన ప్రచారం కల్పించడంతో పాటు తగిన నిధులు కేటాయించి.. హెూమియో వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

ఇతర సమస్య రాకుండా వైద్యం.. డాక్టర్ నితిన్ ప్రసాద్ రాయ్, ఆర్బీఎస్కే వైద్యాధికారి, మిర్యాలగూడ

ఆంగ్ల మందులు వాడకం వల్ల తక్షణమే వ్యాధి నయమవుతుంది కానీ.. ఇతర అవయవాలపై దుష్ప్రభావాలు కలిగిస్తాయి. హెూమియో వైద్యంలో ఇతర అవయవాలకు ఎలాంటి హాని జరగకుండా మందులు వాడుతారు. హెూమియో వైద్యంలో ఒక్కో రోగిని పూర్తిగా పరిశీలించి.. వారి తత్వాన్ని బట్టి మందులు సిఫారసు చేస్తాం.

# పేరుపేరునా అక్రమాలు!

ఖమ్మం : మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలోని తల్లంపాడు, పొన్నెకల్లు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో నాణ్యత సాకు చూపి క్వింటాకు 5-10 కిలోల తరుగు తీసినట్లు రైతులు చెబుతున్నారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్ కోసం రూ.1,000-2,000 చొప్పున దండుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

భారత పత్తి సంస్థ (సీసీఐ) కేంద్రాల్లో ఈసారి రైతులు దోపిడీకి గురయ్యారు. పత్తిని విక్రయించిన కర్షకుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయటంతో పాటు నాణ్యత సరిగ్గా లేదనే సాకుతో భారీగా తరుగు విధించినట్లు తెలుస్తోంది. మార్కెటింగ్ శాఖ, సీసీఐ అధికారులు ఈ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాత్కాలిక రిజిస్ట్రేషన్ పేరిట వ్యవసాయశాఖ అధికారులు ఇచ్చిన వివరాల్లో తమ పేర్లు లేకపోవటంతో కొంతమంది రైతులు ఇబ్బందులకు గురయ్యారు. అలాంటి వారికి తాత్కాలిక నమోదు (టెంపరరీ రిజిస్ట్రేషన్) చేసుకునే అవకాశాన్ని అధికారులు కల్పించారు. దీన్ని ఆసరాగా చేసుకుని మార్కెటింగ్‌శాఖలోని కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. తాత్కాలిక నమోదు కోసం ఒక్కో రైతు నుంచి రూ.1,000 నుంచి రూ.2,000 వరకు దండుకున్నారు. ఇలా వేలాది మంది కర్షకుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తెలిసింది. పత్తిలో నాణ్యత సరిగ్గా లేదని చెప్పి క్వింటాకు 3-9 కిలోల తరుగు విధించారు. మార్కెటింగ్, సీసీఐ అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమాలు జరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు ఈ అక్రమాలపై ఇల్లెందు ప్రాంతంలోని కొందరు రైతులు మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మార్కెటింగ్‌శాఖ ఉపసంచాలకుడు రాజు.. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సీసీఐ కేంద్రాలున్నచోట సంబంధిత మార్కెట్ కమిటీ కార్యదర్శులను విచారించారు. ప్రతి సెక్యూరిటీ గార్డు నుంచి నెలకు రూ.1,000 చొప్పున ముడుపులివ్వాలని ఒత్తిడి చేస్తున్న ఓ అధికారి విషయంపైనా ఆరా తీశారు. నివేదికను ప్రభుత్వానికి పంపించారు.

చెల్లింపులు పూర్తయ్యేదెన్నడు? బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేవని సుమారు 200 మంది రైతులకు పత్తి డబ్బులను సీసీఐ అధికారులు ఇప్పటికీ చెల్లించలేదు. కొనుగోలు సమయంలో అన్ని వివరాలు తీసుకున్న అధికారులు ఖాతాల్లో డబ్బులు జమచేసే క్రమంలో ఆధార్ అనుసంధానం కాలేదని చెబుతున్నారు. పోస్టాఫీసు ఖాతాల్లో డబ్బులను జమచేయటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటున్నారు. ప్రైవేట్ వ్యాపారులు దోచుకుంటున్నారని సీసీఐ కేంద్రాలకు వెళ్తే అక్కడా అన్యాయం జరుగుతోందని రైతులు వాపోతున్నారు. సీసీఐ కేంద్రాల్లో తాత్కాలిక నమోదు కోసం రైతుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు, తరుగు పేరిట కోత విధించినట్లు మాదృష్టికి రాలేదు. పత్తి విక్రయించిన కొంతమంది రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఈ అంశాన్ని సీసీఐ అధికారులకు తెలియజేశాం. ఎంఏ అలీం, డీఎంఓ

# జీవనోపాధి మెరుగు.. ఆర్థికాభివృద్ధికి అడుగు



ఎల్లారెడ్డిపేట: వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపొనెంట్ (డబ్ల్యూడీసీ) కింద ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై-2.0) పథకం ద్వారా మహిళల జీవనోపాధులు మెరుగుపడనున్నాయి. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), రాష్ట్ర స్థాయి నోడల్ సంస్థల అనుసంధానంతో జిల్లాలో ఈ పథకం అమలుకు ఇటీవలే శ్రీకారం చుట్టారు. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి, గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రాజెక్టుల పరిధిలో 15 గ్రామాలకు చెందిన 29 స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) ఉన్న 379 మంది సభ్యులను పీఎంకేఎస్‌వై-2.0లో అర్హులుగా గుర్తించారు. సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున వడ్డీ లేని రుణాలను మంజూరు చేశారు. రుణాలు పొందినవారు కొత్తగా వివిధ రకాల వ్యాపారాలు చేపట్టి రాణిస్తున్నారు. స్వయం ఉపాధిని మెరుగుపర్చుకొని కుటుంబ పోషణలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

రూ. 1.92 కోట్లతో ప్రాజెక్టు ప్రారంభం

జిల్లాలో 411 గ్రామైక్య సంఘాలు, 9,821 స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు) ఉన్నాయి. వాటిలో 1,11,801 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. దాదాపు 5 వేల హెక్టార్ల పరిధిలోని సుమారు 8 నుంచి 9 గ్రామాలను కలిపి ఒక ప్రాజెక్టుగా అధికారులు నిర్ణయించారు. అందులో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి, గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రాజెక్టులకు 2022-2023 ఆర్థిక సంవత్సరానికి పీఎంకేఎస్‌వై-2.0 పథకాన్ని వర్తింపజేశారు. వీటి పరిధిలో మొత్తం 379 మంది లబ్ధిదారులను గుర్తించి, వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి రూ. 1.92 కోట్లు విడుదల కాగా, అందులో రూ. 1.89 కోట్లను రుణాలుగా అందించారు. రూ. 50 వేల చొప్పున వడ్డీ లేని రుణాలు తీసుకున్న మహిళలు స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో లబ్ధిదారులు వ్యాపారాలను ప్రారంభించి ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక ఇలా...

పీఎంకేఎస్‌వై పథకం కింద ఎంపికైన గ్రామాల్లో బడ్జెట్ ప్రకారం వాటర్‌షెడ్ కమిటీల తీర్మానం మేరకు ఆయా ఎస్‌హెచ్‌జీ సంఘాల్లో రుణాలు కావాల్సిన వారి పేర్లు ఎంపిక చేసి, మండల సమాఖ్యలకు పంపిస్తారు. మండల సమాఖ్యలకు నిధులు రాగానే లబ్ధిదారులకు రుణాలు అందజేస్తారు. రూ. 50 వేల రుణం తీసుకున్న సభ్యులు ప్రతి నెలా సుమారు రూ. 1,389 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. సక్రమంగా చెల్లించకపోతే రుణంపై మూడు శాతం వడ్డీ వసూలు చేయనున్నారు.

టైలరింగ్ వృత్తితో...

- ఇమ్మడిశెట్టి వినోద, రాజన్నపేట

మా గ్రామంలోని వెన్నెల గ్రామైక్య సంఘం కింద సాయిరామ్ ఎస్‌హెచ్‌జీలో సభ్యురాలిగా ఉన్నాను. భర్త శివరాంతో కలిసి టైలరింగ్ వృత్తిలో కొనసాగుతున్నాను. నాకు వచ్చిన రూ. 50 వేల రుణంతో పరికరాలు కొనుగోలు చేసి, వ్యాపారాన్ని విస్తరించాం. సీజన్‌లో అన్ని ఖర్చులు పోనూ బాగానే గిట్టుబాటు అవుతుంది.

ఎలక్ట్రికల్ దుకాణం నడుపుతున్నా

- పందిర్ల రేఖ, రాచర్ల గొల్లపల్లి


నాకు వచ్చిన రుణంతో ఎలక్ట్రికల్ దుకాణాన్ని నడుపుతున్నాను. భర్త రమేశ్ కూడా ఎలక్ట్రికల్ రంగంలో ఫ్యాన్‌లు, కూలర్‌ల మరమ్మతు చేస్తుంటారు. హౌస్ వైరింగ్ కూడా చేస్తారు. బీడీలు చుట్టే నాకు ఎలక్ట్రికల్ షాపు నిర్వహణతో అదనపు ఆదాయం సమకూరుతోంది. వచ్చే లాభాలతో మున్ముందు షాపులో మరిన్ని పరికరాలను అందుబాటులో ఉంచాలన్నదే నా లక్ష్యం.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- మల్లేశం, ఐకేపీ ఏపీఎం, ఎల్లారెడ్డిపేట

ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన పథకంలో మంజూరైన రుణాలను లబ్ధిదారులు సద్వినియోగపరచుకొని ఆర్థికంగా ఎదగాలి. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించి, రాబోయే కాలంలో మిగతా సభ్యులకు కూడా అవకాశం కల్పించాలి. గ్రామైక్య, స్వయం సహాయక సంఘాలు క్రమం తప్పకుండా సమావేశాలు, పుస్తక నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలి.

# సర్కారు బడులకు మంచి రోజులు



పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత వెంటాడుతోంది. మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతి లేక ఒకటి, రెండు అవసరాలకు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. 'మన ఊరు-మన బడి' పథకానికి ఎంపికైన పాఠశాలల్లో కొంతమేర వసతులు తీరినప్పటికీ మిగిలిన చోట్ల ఇబ్బందులు తప్పడం లేదు. ఈ క్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కనీస వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అభివృద్ధి పనుల నిర్వహణ బాధ్యతను 'అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల'కు అప్పగించారు. పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

వేసవి సెలవుల్లోనే పూర్తి ప్రతి పాఠశాలలో కనీస వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించారు. ఇందుకు యూడైస్ వివరాలను ప్రామాణికంగా తీసుకున్నారు. బడుల్లో చేసే పనులపై ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో సంయుక్తంగా పరిశీలిస్తారు.

అవసరమైన చోట్ల వేసవి సెలవులు ముగిసి పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అభివృద్ధి పనుల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించారు. అతివల ఉపాధిని రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేస్తోంది.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు సంబంధించి జిల్లాలో 545 బడులు ఎంపికయ్యాయి. వీటిలో ఇప్పటివరకు 526 చోట్ల కమిటీల ఏర్పాటు పూర్తయింది. 429 చోట్ల బ్యాంకు ఖాతాలు తెరిపించారు. మిగిలిన పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి.

545 పాఠశాలలు.. 2,556 యూనిట్లు

జిల్లాలోని 545 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు 2,556 యూనిట్లకు సంబంధించి రూ.19.38 కోట్లు మంజూరయ్యాయి. కొన్నాళ్లుగా నిధుల కోసం నిరీక్షిస్తున్న బడులకు పూర్వ వైభవం రానుంది. ప్రధానంగా బాలురు, బాలికలకు వేర్వేరుగా మూత్రశాలలు, గదుల మరమ్మతు, విద్యుదీకరణ పనులు చేపట్టనున్నారు. చాలా చోట్ల తాగునీటి కోసం చేతిపంపులే దిక్కవుతున్నాయి. ప్రస్తుతం మంజూరైన నిధులతో శుద్ధ జలం అందించేందుకు కుళాయిలు ఏర్పాటు చేస్తారు.

నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ-మాధవి, జిల్లా విద్యాధికారి


ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు తుది దశకు చేరింది. వేసవిలోనే పనులు పూర్తి చేయనున్నాం. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం.

# సిమెంటు రోడ్డు.. సగంలో వదిలేశారే..!

తాండూరు : తాండూరు పట్టణంలో వర్షా కాలంలో వరద రోడ్డు మీద పారితే రాకపోకలు స్తంభించి పోతాయి. సమస్య పరిష్కారానికి తాండూరు- హైదరాబాద్ రోడ్డు కూడలి నుంచి మైనార్టీ గురుకుల పాఠశాల దాకా గత ఏడాది రూ.5.2 కోట్లతో సిమెంటు రోడ్డు పనులు చేపట్టారు. రెండు వైపులా 3 కిలో మీటర్ల పొడవునా సిమెంటు రోడ్డు, వరద కాల్వ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి దాకా ఒక వైపు 2.4 కిలో మీటర్లు పొడవు మాత్రమే రోడ్డు వేశారు. మరో వైపు పాత తారు రోడ్డు అలాగే ఉంది. తారు రోడ్డు ధ్వంసం అవటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పనులు అసంపూర్తిగా ఉండటంతో వాహనాదారులకు అవస్థలు తప్పడం లేదు. వర్షాకాలం వచ్చేలోపల సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాక పోతే పరిస్థితి మళ్లీ మొదటికి రాక తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పరీక్ష ఫలితం విషమించొద్దు

నాంపల్లి : వార్షిక ఫలితాలు.. పరీక్షలు రాసిన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యాలయాల యాజమాన్యాలకు ఉత్కంఠ. పరీక్షలు బాగానే రాసినా ఫలితం ఎలా ఉంటుందోనన్న ఆందోళన అందరిలోనూ ఉంటుంది. ఈ ఫలితాల ప్రక్రియ అందరిలోనూ ఒక విధమైన కుంగుబాటుకు కారణమవుతుంది. ఫలితాలపై భారీ అంచనాలు పెంచుకోవడమే దీనికి కారణం. ఫలితాలు ఎలా వచ్చినా కుంగిపోకుండా ధైర్యంగా మరోసారి ప్రయత్నించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలు గొప్పవాళ్లు కావాలని కోరుకుంటారు. ఇక యాజమాన్యాలు తమ ప్రాచుర్యం కోసం పరితపిస్తుంటాయి. అటు తల్లిదండ్రులు, విద్యాలయాల యాజమాన్యాల ఆశయాలకు అనుగుణంగా ఫలితాలు రాబట్టాలనే మానసిక సంఘర్షణ విద్యార్థుల్లో



పెరిగిపోతోంది. వీటికి భిన్నంగా ఫలితాలు రావడంతో కుంగిపోతున్నారు. కానీ మార్కులు పరమావధి కాదని.. భవిష్యత్తుపై ఆశలు పెంచే కుటుంబాలే ఇప్పుడు విద్యార్థులకు అవసరం.

కుంగుబాటు దూరం చెయ్యాలి..

ఒక్క మార్కు తక్కువ వచ్చినా కుంగుబాటుకు గురవుతారు. వీటిని నిరోధించడానికి స్ఫూర్తిప్రదాతల విషయాలను చెప్పాల్సిన అవసరం ఉంది. వచ్చిన ఫలితాలనే విద్యార్థుల భవితకు పునాది.. ప్రేరణగా మార్చుకోవాలి. వారి సామర్థ్యాన్ని గుర్తించడానికి కొలమానంగా భావించాలి. స్ఫూర్తిదాయక మాటలతో సాంత్వన చేకూర్చాలి.

ఈ కుబేరులేం చదువరులు కారు..

ప్రపంచ కుబేరుల జాబితాల్లో పేరు సంపాదించిన ఎక్కువ మంది ఏదో కారణంతో చదువు మధ్యలో ఆపేసిన వారే.. కానీ సంపాదన విషయంలో వారి పేర్లనే ఉదహరిస్తున్నాం. అందుకు వారు చేసిందొక్కటే. నచ్చిన మార్గంలో ప్రయాణించి అనుకున్న విజయం సాధించే వరకు విశ్రమించకపోవడమే. ధ్రువపత్రాలను కేవలం అర్హతగానే పరిగణించారు. వారి ఆలోచనలకు పదును పెట్టారు. వైఫల్యాలను అనుభవాలుగా స్వీకరించి విజయాలు సాధించారు. అలాంటి వారి గురించి తెలుసుకొందామా..!

ల్యారీ ఎలీసన్: ఒరాకిల్ డేటా బేస్ సాఫ్ట్‌వేర్ సంస్థను స్థాపించిన ఆయనను పెంపుడు తండ్రి ఎందుకు పనికిరాడని తిట్టేవారట. తర్వాత రెండు విశ్వవిద్యాలయాల నుంచి డ్రాపవుటై అంచెలంచెలుగా ఎదిగి ల్యారీ ఒరాకిల్‌ను స్థాపించారు. సంపదలో ప్రత్యేక స్థానాన్ని పొందారు.

జుకర్‌బర్గ్: ఫేస్‌బుక్ తెలియని విద్యార్థులు అరుదు. సామాజిక మాధ్యమాల్లో అత్యంత ఆదరణ పొందిన ఫేస్‌బుక్‌ను రూపొందించడానికి జుకర్‌బర్గ్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువు మధ్యలో మానేశారు. చిన్నప్పుడు ప్రోగ్రామింగ్ నేర్చుకోవడంతో సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగి నేడు కుబేరుడయ్యారు.

జాన్‌కెమ్: స్మార్ట్‌ఫోన్ ఉన్నవారిలో వాట్సప్ తెలియనివారుండరు. పిల్లలైతే మరీ ఎక్కువ. ఈ యాప్ రూపకర్తల్లో ఒకరు జాన్‌కెమ్. యాహూలో ఉద్యోగం కోసం చదువును మధ్యలో వదిలేశారు. తల్లి చనిపోయాక ఒంటరితనంతో బాధపడుతున్న ఆయన్ని స్నేహితుడు ఆదరించారు. అతడితో కలిసి రూపొందించిన వాట్సప్‌తో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారు.

# గ'లీజు' దందా..!

కోదాడ : పట్టణాల్లోని ప్రధాన చౌరస్తాల్లో, రహదారుల వెంబడి పురపాలిక స్థలాల్లో డబ్బా దుకాణాలు చూస్తుంటాం. ఈ దుకాణాలను బతుకుదెరువు కోసం కొందరు ఏర్పాటు చేసుకుంటే, మరి కొందరు ఇతరులకు లీజుకిస్తూ వ్యాపారం చేస్తున్నారు. ఏడాదికి పురపాలికకు నామమాత్రపు ఫీజు చెల్లిస్తూ, సామాన్యుల దగ్గర నెల వారీగా అద్దెలు వసూలు చేస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి, నిజమైన లబ్ధిదారులకు దుకాణాలు కేటాయించేలా చర్యలు చేపట్టాలని అద్దెకు తీసుకున్న వారు కోరుతున్నారు.

నిజమైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటాం:
రమాదేవి, పురపాలిక కమిషనర్, కోదాడ

పట్టణంలోని రహదారుల వెంబడి ఉన్న డబ్బా దుకాణాల పేరిట కొందరు అద్దె వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిజమైన లబ్ధిదారులకు దుకాణాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

ఈ చిత్రంలో కనిపిస్తున్న డబ్బా దుకాణాలు కోదాడ బస్టాండ్ సమీపంలో



నివి. వీటిలో వ్యాపారం చేసేవారు సొంతగా ఏర్పాటు చేసుకున్నవి కాదు. వేరే వాళ్ల దగ్గర నుంచి తీసుకొని నెలకు రూ.10 వేలకు పైగా అద్దె చెల్లిస్తున్నారు. కొందరు బతుకుదెరువు పేరిట డబ్బా దుకాణాలు ఆక్రమించి అద్దెలకిస్తున్నారు అనడానికి ఈ దుకాణాలే సాక్ష్యం. ఇలా కోదాడ పట్టణంలో 106 దుకాణాలు ఉన్నాయి. ఒక్కో దుకాణానికి రూ.10 వేలు అద్దె వసూలు చేసినా కోటి రూపాయలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లచికి వెళ్తున్నాయి. వీరు పురపాలికకు ఏడాదికి కలిపి ఒక్కో దుకాణానికి కేవలం రూ.3 వేలు చెల్లిస్తుండటం గమనార్హం. పురపాలికకు రూ.3 వేలు చెల్లించి, అద్దెల ద్వారా ఒక్కో దుకాణం పేరిట సుమారు రూ.లక్ష వరకు సంపాదిస్తున్నారన్నమాట.




పుణె: గత పదేళ్లలో దేశ విదేశాంగ విధానంలో గణనీయమైన మార్పు వచ్చిందని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ఈ మార్పే సరైన విధానమని తెలిపారు. ముష్కరులకు ఎలాంటి నియమాలు ఉండనప్పుడు.. దాడులకు ప్రతిస్పందన కూడా అలాగే ఉంటుందన్నారు. మహారాష్ట్రలోని పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో జైశంకర్ పాల్గొన్నారు. ఉగ్రవాద ముప్పు, దేశ దౌత్య సంబంధాల వంటి అంశాలపై యువత అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. ఏయే దేశాలతో సంబంధాలు కొనసాగించడం కష్టంగా ఉందని అడగ్గా.. పొరుగున ఉన్న పాకిస్థాన్ అని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించేది లేదని దాయాదిని ఉద్దేశిస్తూ మరోసారి తేల్చి చెప్పారు. "పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని తమ ప్రయోజనాలకు ఉపయోగిస్తోందని మనం మొదట్నుంచీ స్పష్టంగా ఉంటే అప్పుడు భారత విదేశాంగ విధానం భిన్నంగా ఉండేది. అయితే, 2014 నుంచి మన విదేశీ విధానంలో 50 శాతం మార్పు వచ్చింది. అది కూడా ఉగ్రవాదంపై మనం స్పందించే తీరులోనే..! ముంబయి దాడుల తర్వాత ఉగ్రవాదంపై భారత్ స్పందించాలని అందరూ అనుకున్నారు. ఆ సమయంలో పాకిస్థాన్‌పై దాడి చేయడం కంటే.. చేయకపోవడమే వల్లే ఎక్కువ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఒకవేళ, 26/11 ముంబయి పేలుళ్ల వంటి ఘటన ఇప్పుడు జరిగితే దానికి మనం ప్రతీకారం తీర్చుకోకపోతే.. తర్వాతి దాడులను మనం ఎలా నిరోధించగలం..?" అని జైశంకర్ అన్నారు.

"సరిహద్దులకు ఆవల ఉన్నాం కదా.. మనల్ని ఎవరూ టచ్ చేస్తారని ముష్కరులు అనుకుంటున్నారు. అది నిజం కాదని మనం రుజువు చేయాలి. ఉగ్రవాదులు ఎలాంటి రూల్స్ పెట్టుకుని దాడులు చేయరు.. అలాంటప్పుడు వారి చర్యలకు ప్రతిచర్యలు కూడా ఎలాంటి నియమాలకు లోబడి ఉండాల్సిన అవసరం లేదు" అని కేంద్రమంత్రి అభిప్రాయపడ్డారు.

## అప్రూవర్ల వాంగ్మూలం ఆధారంగా కవితను ప్రశ్నించనున్న సీబీఐ



ఢిల్లీ: మద్యం కేసులో సీబీఐ విచారణ కొనసాగుతోంది. భారాస ఎమ్మెల్సీ కవిత శని, ఆదివారాల్లో వారి కస్టడీలో ఉండనున్నారు. కోర్టు ఆదేశాలతో కవితను అధికారులు సంస్థ కేంద్ర కార్యాలయానికి తరలించారు. ఢిల్లీ మద్యం విధానం రూపకల్పన, అక్రమాల్లో కవితను కీలక సూత్రధారి, పాత్రధారిగా కేంద్ర దర్యాప్తు సంస్థ పేర్కొంది. అప్రూవర్లుగా మారిన వారు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ఆమెను అధికారులు ప్రశ్నించనున్నారు. తమ కస్టడీలో ఉన్న సమయంలో ప్రతి 48 గంటలకు వైద్య పరీక్షలు చేయించనున్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య న్యాయవాది, కుటుంబ సభ్యులను కలిసేందుకు కవితకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఆమె భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, పీఏ శరత్, న్యాయవాది మోహిత్ రావును కలిసేందుకు అవకాశం కల్పించింది.

## మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు కేసులో మరో ట్విస్ట్..

హైదరాబాద్ : మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు కేసులో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. రాహిల్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, రాహిల్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ పోలీసులు హైకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారు. ఇదే సమయంలో జూబ్లీహిల్స్‌లో 2022లో జరిగిన రోడ్డు ప్రమాదం కేసును కూడా రీ ఓపెన్ చేయనున్నారు. ఈ కేసు దర్యాప్తు చేసిన అప్పటి పోలీసు అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పంజాగుట్ట కేసుమాదిరిగానే.. జూబ్లీహిల్స్ కేసులోనూ రాహిల్‌ను తప్పించారు అప్పటి పోలీసులు. తనకు బదులుగా వేరే వ్యక్తిని డ్రైవర్‌గా పంపించాడు రాహిల్. ఇప్పటికే ఈ కేసులో చార్జిషీట్ సైతం దాఖలు చేశారు పోలీసులు. చార్జిషీట్లోనూ రాహిల్‌ను తప్పించే ప్రయత్నం చేశారు అప్పటి జూబ్లీహిల్స్ పోలీసులు.

**అసలేం జరిగింది..** 2022 మార్చ్‌లో జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో కారు ప్రమాదం జరిగింది. ఈ ఘోర ప్రమాదంలో నెలల వయసున్న చిన్నారి ప్రాణాలు కోల్పోగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కేసు రీ ఓపెన్ చేశాక బాధితుల స్టేట్‌మెంట్‌ను పోలీసులు మరోసారి రికార్డ్ చేశారు. ఈ కేసు విచారణలో రాహిలే ప్రమాదానికి కారణం అని తేల్చారు. అయితే, జూబ్లీహిల్స్ కేసులో రాహిల్‌ను తప్పించిన అప్పటి పోలీసులపై చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మరి పోలీసులు ఈ వ్యవహారంలో ఎలాంటి స్టెప్ తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.




## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఉన్నట్టు కథలు అల్లారు: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

మెదక్ : "నన్ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక మీడియాకు లీకులు ఇచ్చి, తప్పుడు వార్తలు రాయించి లబ్ధి పొందాలని బీజేపీ, కాంగ్రెస్ కలిసి ప్రయత్నిస్తున్న తీరు సిగ్గు చేటు" అని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... గత ఎన్నికల్లో పోటీ కూడా చేయని తనను ఫోన్ ట్యాపింగ్ కేసులో ఉన్నట్టు కథలు అల్లి ప్రచారం చేయడం బట్ట కాల్చి మీద వేయడమే అంటూ వ్యాఖ్యలు చేశారు. ఓటమి తప్పదని గ్రహించి రెండు పార్టీలు చేతులు కలిపి తనను ఓడించాలని దుష్ట పన్నాగం పన్నుతున్నాయన్నారు. సిద్ధాంతాలు, విలువలు గాలికి వదిలి ప్రజల్ని మభ్యపెట్టే స్థాయికి దిగజారాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా, కలెక్టర్‌గా ప్రజలకు నిజాయతీగా సేవలు అందించానని చెప్పుకొచ్చారు. ప్రజా సేవకుడిగా ఇంకా ఎక్కువ సేవలు అందించడానికి ప్రత్యక్ష రాజకీయంలోకి వచ్చానని వెల్లడించారు. పేద విద్యార్థులకు విద్య అందించేందుకు, స్కిల్ డెవలపమెంట్ కార్యక్రమాల కోసం వంద కోట్లతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు ప్రకటించానని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఫంక్షన్ హాల్ నిర్మించి సేవలు అందిస్తా అని మాట ఇచ్చానన్నారు. తాను ఓట్ల కోసం అబద్ధాలు చెప్పే వ్యక్తిని కాదని... నీచ రాజకీయాలు చేసే వ్యక్తిని కాదున్నారు. ఈ విషయం ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలందరికీ తెలిసిందే అని చెప్పుకొచ్చారు. ప్రజల అభిమానం మెండుగా ఉన్న తనపై విమర్శలు చేయడానికి ఎలాంటి అవకాశం లేకపోవడంతో బీజేపీ, కాంగ్రెస్ కలిసి కుట్ర చేస్తున్నాయని.. తన మనో స్థైర్యం దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు చేసినా, ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు తన వైపే ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా తప్పుడు వార్తల పుకార్లు వ్యాప్తి చేయడం మాని విధానాలు సిద్ధాంతాల పరంగా ఎన్నికల్లో తలపడదామని మెదక్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు వెంకట్రామరెడ్డి విజ్ఞప్తి చేశారు.

ప్రభాత
సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194



# ఢీ అంటే ఢీ

## కాక రేపుతున్న పొన్నం - బండి సవాళ్ళ పర్వం

కరీంనగర్ : మరో ఆరు రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయి నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుండగా జిల్లాలో రాజకీయ వేడి రాజుకుంటున్నది. రెండు రోజులుగా కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మాటల తూటాలు పేలుతున్నాయి. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తిచేసుకున్నా విభజన హామీలను విస్మరించిందని, దానికి నిరసనగా ఈనెల 14న కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో దీక్ష చేపడతానని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో బీజేపీ కూడా ఆయనకు దీటుగా సమాధానం చెప్పేందుకు సిద్ధం కావడం రాజకీయ కలకలాన్ని సృష్టిస్తున్నది.

**పరస్పర ఆరోపణలు :** విభజన హామీలను విస్మరించిన బీజేపీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందని, ఓట్లు అడిగే నైతిక హక్కు ఆ పార్టీకి లేదని పొన్నం ప్రభాకర్ విమర్శిస్తున్నారు. గడిచిన పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రానికి ఏమి చేశారో చెప్పాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకున్నారని ఆయన విమర్శించారు. రాముడి ఫొటోలు, అక్షింతలు ఇంటింటికి పంపడం మినహా ప్రతి ఇంటికి ఏమి చేశారో చెప్పాలని, బీజేపీకి చేతనైతే రాముడి బొమ్మతో కాకుండా మోదీ బొమ్మతో ఓట్లు అడగాలని పొన్నం సవాల్ విసిరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తమతమ నియోజకవర్గాల్లో ఏమి చేశారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

– పొన్నం ప్రభాకర్ దీక్షా ప్రకటనను ఎంపీ బండి సంజయ్‌కుమార్ తీవ్రంగా దుయ్యబట్టారు. పదేళ్లుగా ఈ విషయంలో పొన్నం ప్రభాకర్ ఏం చేశాడని, ఇప్పుడు దీక్ష ఎందుకు చేస్తానంటున్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ళ కేసీఆర్ పాలనలో ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని, వాటికి నిరసనగా ధమ్ముంటే తెలంగాణ భవన్ వద్ద దీక్ష చేయాలని పొన్నంకు సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నందుకు నిరసనగా గాంధీ భవన్ ఎదుట ధర్నా చేయాలని ప్రభాకర్‌ను డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో అన్నివర్గాలు దగాకు గురైతే ఒక్కనాడు కూడా ఎందుకు దీక్ష చేయలేదని, మద్దతు ధర రాక వడ్ల కుప్పలపై బడి రైతులు గుండె పగిలి చస్తుంటే ఎందుకు దీక్షలు చేయలేదని పొన్నం ప్రభాకర్‌ను ప్రశ్నించారు. నరేంద్ర మోదీ 80 కోట్ల మంది పేదలకు ఏళ్ల తరబడి ఉచితంగా బియ్యం ఇస్తున్నందుకు దీక్ష చేస్తావా..., దేశ ప్రజలందరికీ కరోనా సమయంలో ఉచితంగా వ్యాక్సిన్ ఇచ్చినందుకు దీక్ష చేస్తావా ప్రజలకు వివరించాలని సంజయ్ పొన్నంను ప్రశ్నించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి 12 వేల కోట్ల నిధులు ఇస్తున్నందుకు దీక్ష చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి తనను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అభ్యర్థే దొరకని కాంగ్రెస్, బీఆర్ఎస్ అపరమేధావి కలిసి తనను ఓడించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌ను తానే అభివృద్ధి చేశానంటున్న పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు ఎందుకు పారిపోయారో ఆయన కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తే ప్రజలకు ఎందుకు డిపాజిట్ రాకుండా చేశారో జవాబివ్వాలని ఆయన సవాల్ విసిరారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను లక్ష్యంగా చేసుకొని మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రజల్లోకి వెళుతూ విమర్శనాస్త్రాలు సంధిస్తుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీ గెలుపును అడ్డుకోవాలని చూస్తున్నాయని ఆ రెండు పార్టీలు ఒక్కటేనని బీజేపీని గెలిపించాలని బండి సంజయ్‌కుమార్ ప్రజలకు వివరిస్తున్నారు.

**రోజురోజుకు మారుతున్న సమీకరణాలు...** గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని చేసిన ప్రచారం చేసింది. ఇప్పుడు బీజేపీ అదే అస్త్రాన్ని సంధిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే అంటూ ప్రచారం చేయడం కరీంనగర్‌లో కొత్త సమీకరణాలకు తెరతీసే అవకాశం కనిపిస్తున్నది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే ప్రచారంలో ఎంతో ముందంజలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్‌లను నిలువరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ పార్టీ అధిష్ఠానం ఇంకా కరీంనగర్ అభ్యర్థి ఎవరో ఖరారు చేయక పోవడం మైనస్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అభ్యర్థి ఎవరో తేల్చుకోలేక పోతున్నదని, అసలు అభ్యర్థి లేడని ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పలేని పరిస్థితిలో ఆ పార్టీ ఉందని బీజేపీ చేస్తున్న ప్రచారం ఆ పార్టీని ఇబ్బంది పెడుతున్నది.

## ఢిల్లీకి వెళ్లనున్న కేటీఆర్.. కారణమిదేనా..?



హైదరాబాద్, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రేపు (ఆదివారం) ఢిల్లీకి వెళ్లనున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయి ప్రస్తుతం సీబీఐ కస్టడీలో ఉన్న సోదరి కవితను కలిసేందుకు కేటీఆర్ ఢిల్లీ వెళ్తున్నట్లు సమాచారం.

కస్టడీ సమయంలో రోజూ గంట పాటు కుటుంబ సభ్యులను కలిసేందుకు వెసులుబాటు ఉంది. ప్రస్తుతం సీబీఐ హెడ్‌క్వార్టర్స్‌లో కవిత విచారణను ఎదుర్కొంటున్నారు. సాయంత్రం 6:00 గంటల నుంచి 7:00 గంటల మధ్య న్యాయవాది, కుటుంబ సభ్యులను కలిసేందుకు కవితకు అవకాశం ఉంది. రేపు సాయంత్రం ఈ సమయంలో కవితను కేటీఆర్ కలవనున్నట్లు తెలుస్తోంది.

## బీఆర్ఎస్‌కు ఓటేస్తే.. మూసీ నదిలో వేసినట్టే...

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే, అది మూసీ నదిలో వేసినట్టేనని కేంద్రమంత్రి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం గుడిమల్కాపూర్ నుంచి మెహిదీపట్నం, పద్మనాభనగర్‌లో బైక్‌ర్యాలీ రోడ్‌షోను నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మూడోసారి నరేంద్రమోదీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

దేశ ప్రజల కోసం అహర్నిషలు కష్టపడుతున్న మహోన్నతమైన వ్యక్తి నరేంద్రమోదీ అని ఆయన కొనియాడారు. నాంపల్లి నియోజకవర్గంలో ఓట్లు చీలకుండా మనమంతా ఐక్యంగా ఉండి బీజేపీని గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన వెంట బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి



అన్నపురం రమేశ్‌కుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాహుల్‌చంద్ర, డివిజన్ అధ్యక్షులు ముఖేశ్, జనార్ధన్‌రావు, విజయ్, బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర తదితరులు ఉన్నారు.

## 'అసద్' ప్రచారం ఆరంభం.. కార్యకర్తలతో కలిసి ఒవైసీ పాదయాత్ర



హైదరాబాద్: రంజాన్ మాసం ముగియడంతో మజ్లిస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ వందలాది మంది కార్యకర్తలను వెంట తీసుకుని బహదూర్‌పురా శాసనసభ నియోజకవర్గంలోని కామాటిపురా, ఉస్మాన్‌బాగ్‌లతో పాటు బొందలగూడ ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు.

స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు జెండాలు పట్టుకుని బస్తీల్లో తిరుగుతూ పతంగ్ గుర్తుకు ఓటు వేసి ఒవైసీని గెలిపించాలని నినాదాలు చేశారు. మజ్లిస్ కు విజయం చేకూర్చాలని హ్యాండ్ మైక్ పట్టుకుని అసదుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి చేశారు. పోలింగ్‌రోజున టీవీలు చూస్తూ ఇళ్లకే పరిమితం కాకుండా బూత్‌లకు వచ్చి ఓటుహక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఇజ్రాయెల్–ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో వలస వెళ్లిన భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నేను లోకల్.. రాగిడి నాన్‌లోకల్, డమ్మీ క్యాండిడేట్

హైదరాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు జెడ్పీ చైర్ పర్సన్‌గా పని చేసిన నేను లోకల్ అని, వరంగల్‌కు చెందిన రాగిడి లక్ష్మారెడ్డి డమ్మీ క్యాండిడేట్ అని పట్నం సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం కీసరలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన కీసర మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరి వర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి, మైనంపల్లి హనుమంత్‌రావు, నక్క ప్రభాకర్ గౌడ్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా మాల్కాజ్‌గిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల మాజీ మంత్రి కేటీఆర్ నేను లోకల్ కాదని చివాకులు పలుకుతున్నాడు. ఉమ్మడి రంగారెడ్డి జల్లాకు జెడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేసి, మేడ్చల్ నియోజకవర్గం కోసం దాదాపు 3 వందల కోట్ల రూపాయాలు కేటాయించానని ఆమె తెలిపారు. అసలైన డమ్మీ అభ్యర్థి బీఆర్ఎస్ పార్టీకి చెందిన రాగిడి లక్ష్మారెడ్డి అని, అతను వరంగల్‌కు చెందిన వారని అన్నారు. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి నాన్‌లోకల్ అని, బీజేపీ తన ఉనికి చాటుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుందన్నారు. గత ఎంపీ ఎన్నికలో రేవంత్‌రెడ్డిని మెజార్టీతో గెలిపించిన ఘనత మాల్కాజ్‌గిరి పారమెంటుకు చెందిన ప్రజలదని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలదన్నారు. అదే స్పూర్తితో రానున్న ఎంపీ ఎన్నికల్లో ఎంపీగా నన్ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుడి వల్లే పని చేయాలని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. సమావేశానికి ముందు ఆమె కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కీసర మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660